


ఈకాలం
THE HONEST TELUGU DAILY

**నేడు ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్ లో సామూహిక..**

# వందేమాతర గీతాలాపన!



Bankim Chandra Chatterjee

ఈకాలం, ఆదిలాబాద్ వందేమాతర గీతాలాపనకు 150 ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో ఈరోజు ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్ లో సామూహిక వందేమాతర గీతాలాపన చేస్తున్నట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదిలాబాద్ సభ్యులు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణ రోడ్లపై గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాటుచేసిన స్పీకర్లలో వందేమాతర గీతం వినిపిస్తుందని, అది వింటూ ప్రతి ఒక్కరు సావధానంగా గీతాలాపన చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దినేష్ మాటోలియా, కందుల రవీందర్ తెలిపారు.






# ఈకాలం వార్త

THE HONEST TELUGU DAILY




శుక్రవారం 25- 09- 2026 | పేజీలు : 5 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :329 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

## సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'! - సీజేపీ



2లో▸

## జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు సిద్ధం!




2లో▸

## శబరిమలలో బంగారు కిరీటం మాయమైందా..? వార్తల్లో నిజమెంత..!



2లో▸

### కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై

# పవన్ సమీక్ష



కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై కలెక్టర్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు.

2లో▸




### దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్

# కేంద్రం పూర్తి చేయాలి

## -సీఎం రేవంత్ రెడ్డి



2లో▸

దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

గురువారం విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షించారు.

యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై అధికారులను సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రశ్నించారు.

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ 9 బొగ్గు అవసరమని అధికారులు

తెలిపారు. సింగరేణి లో జీ 9 బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు చెప్పుకొచ్చారు.

జీ 9 బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతతో ఎలా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లు ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, దూరంగా ఎందుకు యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించారని, దానికి బొగ్గు సరఫరాతో రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని సీఎం, డిప్యూటీ సీఎం లు అధికారులని ప్రశ్నించారు. నాడు రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్ పై కాకుండా దూరంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు వివరించారు.

## ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా..

**ప్రజల్లో నాకు బలముంది: దానం**



2లో▸

### దానం నాగేందర్‌పై సుప్రీం తీర్పు

## రాజ్యాంగ విజయం:

**ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**



2లో▸

హైదరాబాద్: దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

# ఒక వికెట్ పడింది, త్వరలో మరికొన్ని వికెట్లు ..

## దానం అన్హరతపై కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ట్వీట్ చేశారు. ఒక వికెట్ పడింది. త్వరలో మరికొన్ని వికెట్లు పడుతాయని జోస్యం చెప్పారు.

2లో▸

# సంపాదకీయం

## కొత్త రాజ్యాంగం ఎలా ఉండాలి?

మానవ నాగరికతల గమనం అనూహ్య వేగంతో, ఆశ్చర్యకరమైన, అదే సమయంలో భయ విహ్వలమైన మార్పులతో సాగుతోంది. ఈ చారిత్రక దశ (21వ శతాబ్ది)లో ప్రజాస్వామ్య వ్యవస్థలకు మార్గదర్శకత్వం వహించే ఒక సరికొత్త రాజ్యాంగం ఎలా ఉండాలి? ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా ఉన్న భారతదేశ పౌరులమైన మనకు ఆ ప్రశ్న ఒక విధమైన ఆందోళన, భయాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే, భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే ప్రమాదం పొంచి ఉన్నందున. ట్రంప్ అమెరికాలో ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభం, యూరప్‌లో కరుడుగట్టిన మితవాదశక్తులకు క్రమేణా పెరుగుతున్న రాజకీయ ప్రాబల్యాన్ని గమనిస్తే ప్రజాస్వామ్యానికి దాపురిల్లుతోన్న దయనీయ స్థితి అవగతమవుతుంది. ఈ పరిణామాల దృష్ట్యా '21వ శతాబ్దానికి కొత్త రాజ్యాంగం ఎలా ఉండాలి? అన్న ప్రశ్న ప్రపంచవ్యాప్తంగా ఎంత అత్యవసరమైనదో మనం అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగాన్ని ఒక నామవాచకంగా మాత్రమే కాకుండా ఒక క్రియగా చూడాలి. ఒక ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడం, నిర్మించడం అనే కోణంలో ఆలోచించాల్సిన అవసరమున్నది. అలా ఆలోచిస్తే కొత్త రాజ్యాంగం అనే భావన ప్రజాస్వామ్య భవిష్యత్తును వినూత్నంగా ఊహించేందుకు అవకాశం కల్పిస్తుంది.

సదరు ప్రపంచ ప్రశ్నకు సమాధానమివ్వగల విశిష్టత భారత ప్రజాస్వామ్యానికి ఉందని నిశ్చితంగా చెప్పవచ్చు. నిజమే, మన ప్రజాస్వామ్యం ఇప్పుడు సవ్యంగా లేదు. నిక్కచ్చిగా చెప్పాలంటే ప్రజాస్వామ్య పతనానికి ఒక ఉదాహరణగా ఉంది. అయితే ప్రజాస్వామ్య పునరుజ్జీవానికి, ప్రభావదాయక వికాసానికి దోహదం చేసే కొత్త ఆలోచనలను అది అందించగలదని కూడా మనం నమ్మకంగా చెప్పగలం. పురానవ భారతీయ భావన స్వరాజ్‌నే తీసుకోండి. ప్రజాస్వామ్య ఆదర్శాన్ని సమున్నతపరిచే భావన అది, సందేహం లేదు. ప్రజాస్వామ్యం అంటే ఏమిటి అన్న ప్రశ్నను సాధారణంగా వివేచించినప్పుడు ప్రజల స్వయం పాలన, పాలకులతో ప్రజలకు ఉండే సంబంధాల తీరుతెన్నులు ప్రధానంగా ఆలోచనకు వస్తాయి. తమ పాలకులను ఎన్నుకునేందుకు, ఎన్నుకున్న తరువాత వారు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా జాగ్రత్త వహించేందుకు పౌరులకు సమాన హక్కు ఉండాలన్నది ప్రజాస్వామ్య భావన. అయితే పౌరుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనే విషయమై మనం పెద్దగా శ్రద్ధ చూపం. ఇదిగో ఇక్కడే స్వరాజ్ భావనకు గాంధీజీ ఒక భిన్నమైన, మౌలిక అర్థాన్ని సమకూర్చారు. స్వరాజ్ అంటే కేవలం స్వయం పాలన మాత్రమే కాదని, అది మనల్ని మనం నియంత్రించుకోవడమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ తన తోటి పౌరులతో నైతిక విలువల స్ఫూర్తితో సంబంధాలు నెరపడమే స్వరాజ్ అని గాంధీజీ అన్నారు. ఇటువంటి స్వరాజ్యమే ప్రజాస్వామ్య సమస్యలకు పరిష్కారాలను సమకూర్చగలదు. ఈ వినూత్న స్వరాజ్ భావన ప్రకారం ఒక ప్రజాస్వామిక సమాజం ఉమ్మడి ప్రమాణాలకు కట్టుబడి ఉండాలి. నిష్పాక్షిక చర్చలు, స్వయం నియంత్రణ అనేవి అటువంటి ప్రజాస్వామ్యానికి ప్రాథమిక ప్రాతిపదికలుగా ఉంటాయి. సౌభ్రాతృత్వం అనేది ప్రజాస్వామ్య పరిపుష్టికి ఒక ప్రాథమిక నిబంధన అని డాక్టర్ అంబేద్కర్ సైతం నొక్కి చెప్పడం గమనార్హం. సమాజంలో సహోదరభావం లేనప్పుడు ప్రజాస్వామ్యం ఆచరణలో విజయవంతమవదని ఆయన స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యం అంటే కేవలం మంచి వ్యవస్థలు ఉండడం మాత్రమే కాదు, ప్రజాస్వామిక పద్ధతుల బలమైన ఆచరణ కూడా. ప్రజలలో ప్రజాస్వామిక ఆకాంక్షలు సహజంగా ఉంటాయి. అయితే సమాజ సమష్టి జీవనంలో ప్రజాస్వామిక పద్ధతులను నియమబద్ధంగా పెంపొందించాల్సి ఉంటుంది. ఒక ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించడమంటే ప్రజాస్వామిక పద్ధతులను పరిపుష్టం చేయడమే. పంటల సాగు కార్యకలాపాలు ప్రజాస్వామిక పద్ధతులు, సుగుణాలను ఎలా పెంపొందిస్తాయో మానవ శాస్త్రవేత్త ముకూలికా బెనర్జీ తన పరిశోధనా గ్రంథం 'కల్టివేటింగ్ డెమొక్రసీ'లో వివరించారు. ప్రజాస్వామ్య సంస్కృతిని నిర్మించేందుకు, సుస్థిరం చేసేందుకు సమాజంలో పరస్పర సంబంధాలు సోదరభావంతో ఉండాలి. సమాజ సభ్యులందరికీ ఒక ఉమ్మడి లక్ష్యం ఉండాలి. నిత్య పరిణామశీల కాలంలో ప్రభవించే ప్రతి కొత్త తరానికీ ఆ ఉమ్మడి లక్ష్యాన్ని మళ్లీ మళ్లీ వివరించాలి. సద్వర్తనులు అయిన రాజకీయ నాయకులను రూపొందించుకోవాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలలో స్వార్థ ప్రయోజనాలకు యథాలాపంగా పాల్గొనే వారికి కాకుండా ఒక సమున్నత ఆశయానికి నిబద్ధమై, దాన్ని సాధించేందుకు అంకితమయ్యే ఆదర్శవాదులకు అధిక ప్రాధాన్యమివ్వాలి.

21వ శతాబ్దిలో ప్రజాస్వామిక వ్యవస్థల రూపకల్పన విషయమై పునరాలోచనకు 20వ శతాబ్ది భారతీయ రాజకీయ ఆలోచనాపరుల భావ స్రవంతి విశేషంగా దోహదం చేయగలదు. వారందరూ పరిపూర్ణ ప్రగతిశీలురు, స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ప్రజాస్వామిక వ్యవస్థల తీరుతెన్నుల సార్థకతను సంశయించినవారే. 'ప్రజా స్వామ్య సాఫల్యతకు అంబేద్కర్ నొక్కి చెప్పిన ప్రాథమిక నిబంధనలు, మానవేంద్రనాథ్ రాయ్ ప్రతిపాదించిన పార్టీ రహిత ప్రజాస్వామ్యం, భారతదేశ రాజ్య పాలనా పద్ధతుల పునర్నిర్మాణం విషయమై జయప్రకాశ్ నారాయణ్ వాదనలు, అధికార వికేంద్రీకరణకు రామ్‌మనోహర్ లోహియా సూచించిన చౌకంభా రాజ్ (గ్రామం, జిల్లా, రాష్ట్రం, కేంద్రం అనే నాలుగు స్తంభాల రాజ్యం) మొదలైన విశిష్ట ఆలోచనలు ఏవీ వారి వారి జీవిత కాలంలో విస్తృత స్థాయిలో ఆమోదం పొందలేదు. ప్రస్తుత కాలంలోనూ ఆ భావాలను వాటి మౌలిక రూపంలో అనుసరించలేము. అయితే ఆధునిక ప్రజాస్వామ్యాలలో మనం ప్రశ్నించకుండా, సహజమైనవిగా భావించే కొన్ని ప్రాథమిక వ్యవస్థలను, విశ్వాసాలను సరికొత్తగా పునర్నిర్మించుకునేందుకు అవి తప్పక దోహదం చేస్తాయి.

ఆధునిక ప్రజాస్వామ్యాలలోని లోపాలు, లొసుగులు కొన్నిటిని నిశితంగా చూద్దాం. ఈ ప్రజాస్వామ్యాలు చాలా విస్తృతస్థాయిలో పనిచేస్తుండడంతో స్వయం పాలన అనేది అర్థవంతంగా అమలవడం అసాధ్యమవుతోంది. జాతి రాజ్యాలు, వాటిలోని పాలనా విభాగాలు సైతం అదుపు చేయలేనివిగా ఉంటున్నాయి. ప్రయోజనకరమైన స్వయం పాలనను అవి అనుమతించడం లేదు. ఒక సమస్య ఏ స్థాయిలో కనిపిస్తుందో, దానిని పరిష్కరించే శక్తి లేదా అధికారం అంతకంటే భిన్నమైన, సాధారణంగా చాలా పై స్థాయిలో ఉంటుంది. ఈ రెండిటి మధ్య పొంతన ఉండడం లేదు. ఫలితంగా ప్రజల సమస్యలు తీరకపోగా అవి మరింత సంక్లిష్టమవుతున్నాయి. ప్రజాస్వామిక పాలనా వ్యవస్థను క్రింది స్థాయి నుంచి వికేంద్రీకరించాలనే వాదన ఒకటి ఉన్నది. ఈ వికేంద్రీకరణ అనేది 'సబ్సిడియారిటీ సూత్రం' (ఒక సమస్యను పరిష్కరించడం లేదా ఒక నిర్ణయాన్ని తీసుకోవడం అనేది దానికి అత్యంత సమీపంలో ఉన్న, సమర్థంగా పరిష్కరించగల లేదా మెరుగ్గా తీసుకోగల కింది స్థాయి అంటే స్థానిక పాలనా వ్యవస్థలే పరిష్కరించడం లేదా తీసుకోవడం) ప్రకారం జరిగి తీరాలి. ప్రతి 5 లేదా 4, లేదా 2 ఏళ్లకు జరిగే ఎన్నికల కాల పరిమితి ఒకే సమయంలో ఇది చాలా తక్కువగానూ, చాలా ఎక్కువగానూ ఉంటుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజాహిత పాలన చేస్తున్న ప్రభుత్వాలకు ఐదేళ్ల కాలం సరిపోదు. సమాజానికి జరగాల్సిన మేలు అసమగ్రంగా ఉండిపోతుంది. ఇక స్వార్థ ప్రయోజనాలకు ప్రజాకంటక పాలన చేసే ప్రభుత్వాలను అధికారం నుంచి తొలగించేందుకు ఐదేళ్ల వ్యవధి చాలా ఎక్కువ సమయం. ఆధునిక ప్రజాస్వామ్యాలలోని మరో ముఖ్యమైన లోపం ఎన్నికలలో సాధారణ మెజారిటీతో గెలిచిన రాజకీయ పక్షాలకు సర్వాధికారాలను అప్పగించడం. దీనివల్ల చాలా హాని జరుగుతుంది. నేడు పలు దేశాలలో మెజారిటేరియన్ పాలనాధోరణులు ప్రబలిపోవడానికి ప్రధాన కారణం ప్రజాస్వామ్య వ్యవస్థ దారి తప్పడం కానే కాదు. మనం ప్రజాస్వామ్యంగా పరిగణిస్తున్న వ్యవస్థ అంతర్గత రూపకల్పన నుంచే ఆ హానికర ధోరణులు ఉత్పన్నమవుతున్నాయి. ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తే దానికే పూర్తి అధికారాలు అప్పగించాలని మనం నిర్దేశించుకున్న ప్రజాస్వామ్య నియమమే నిరంకుశ పాలనకు దారితీస్తుందన్న సత్యాన్ని మనం గుర్తించాలి.

ప్రజాస్వామ్యానికి అవరోధమవుతున్న వ్యవస్థీకృత లోపాలు, లొసుగులను కూడా ఆధునిక భారత రాజకీయ ఆలోచనాశీలురు మన దృష్టికి తెచ్చారు. కులం, వర్గం మొదలైన సామాజిక అసమానతలు ప్రజాస్వామిక పద్ధతులను అపహాస్యం చేస్తున్నాయి. కుల వ్యవస్థ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, సామాజిక, ఆర్థిక అధికారాల కేంద్రీకరణను ప్రోత్సహిస్తున్నాయి. సమాన హక్కులు ఉన్న పౌరుల స్వయం పాలన భావనకు ఆ అధికారాల కేంద్రీకరణ పూర్తిగా విరుద్ధమైనది. సమాచార, ప్రసార మాధ్యమాలు కార్పొరేట్ సంస్థల నియంత్రణలో ఉండడం వల్ల ప్రజాస్వామిక ప్రజాభిప్రాయం పెంపొందడానికి తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయి. కార్పొరేట్ నియంత్రిత, పాలకవర్గాల అనుకూల పత్రికలు, టీవీలు మొదలైనవి అసంపూర్ణ సమాచారాన్ని, లేదా

### కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై

# పవన్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై కలెక్టర్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. రోడ్లపై కూలిన చెట్లు తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా డీవాటరింగ్ చేసేలా చూడాలన్నారు. తక్షణం పంటనష్టం అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. ఆస్తి నష్టం జరిగిన చోట పరిహారం అందించాలని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో సుద్దగడ్డ వాగు ముంపుపై పవన్ ఆరా తీశారు. ఉప్పాడ తీరంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఎమ్మెల్యే పదవికి అనర్హత అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో తనకు బలముందని చెప్పారు. అనర్హత వేటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆయన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు.

"ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్‌గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం" అని దానం నాగేందర్ అన్నారు.

# ఒక వికెట్ పడింది, త్వరలో మరికొన్ని వికెట్లు ..

మొదటిపేజీ తరువాయి

దానం నాగేందర్ బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందిన తరువాత కాంగ్రెస్‌లో చేరడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే హైకోర్టులో కేసు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం దానంపై అనర్హత వేయాలని కోర్టును కోరారు.

దాదాపు రెండు సంవత్సరాల వరకు ఇరువాదనలు విన్న హైకోర్టు రెండు రోజుల క్రితం దానం నాగేందర్‌పై అనర్హత వేసింది. అనర్హత చెల్లదని సుప్రీంకోర్టులో దానం నాగేందర్ పిటిషన్ వేయగా గురువారం పిటిషన్‌ను పరిశీలించింది. ఈ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించడంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగనుంది.

### దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్

# కేంద్రం పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

సింగరేణి నుంచి జీ 9 బొగ్గు కు ఉన్న అవకాశాలపై సీఎం, డిప్యూటీ సీఎం లు ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ 9 బొగ్గును సింగరేణి సరఫరా చేయలేదని అధికారులు

తేల్చి చెప్పారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క లు ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## ప్రణయ్ పరువు హత్యకేసు.. చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి



చర్లపల్లి (హైదరాబాద్): ప్రేమ వివాహం చేసుకున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసు(ౌతీఖఉఖఎ ఎబతీనవతీ ఝంవ)లో జీవితఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (50) చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబ్దుల్ బారీ మృతి చెందాడు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో బారీ నాల్గో నిందితుడు. గుజరాత్‌కు చెందిన మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ అబ్దుల్ బారీ నిందితుడిగా ఉన్నాడు.

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన, నల్గొండ జిల్లా మిర్యాలగూడలో 2018లో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్‌కుమార్ పరువు హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం, రెండో అదనపు సెషన్స్ జిల్లా కోర్టు గతేడాది మార్చిలో సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రథమ ముద్దాయి తిరునగరు మారుతీరావు... 2020లో హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనిపై విచారణను న్యాయస్థానం అప్పుడే నిలిపివేసింది. ఐదేళ్ల తొమ్మిదినెలల సుదీర్ఘ విచారణ తర్వాత.. హత్యలో కీలక పాత్రధారి సుభాష్‌కుమార్‌శర్మకు ఉరిశిక్ష, ఏ3: అస్గర్ అలీ, ఏ4: అబ్దుల్ బారీ, ఏ5: అబ్దుల్ కరీం, ఏ6: శ్రవణ్‌కుమార్ (మారుతీరావు తమ్ముడు), ఏ7: శివ (మారుతీరావు కారుడ్రైవర్), ఏ8: నిజాం (ఆటోడ్రైవర్)కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం అప్పట్లో తీర్పు ఇచ్చింది.

# సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'! - సీజేపీ

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించింది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

"రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం దిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

'సర్'పై ఈసీల ఢీ.. మీడియాలో కథనాలతో దుమారం

సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్‌ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.

# జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు సిద్ధం!

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు ఇటీవల జాతీయ మీడియాలో కథనాలు రావడంతో విపక్షాలు అప్రమత్తమయ్యాయి. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనరు జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయ సభల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి తీర్మానం ముసాయిదాను రూపొందించే పనిలో నిమగ్నమయ్యాయని, న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం వారం రోజుల్లో ఈ నోటీసులు ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. సీఈసీపై నోటీసులకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్షాలు కలిసి పనిచేస్తున్నాయని తెలుస్తోంది. అయితే, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్న విపక్షాలు.. పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టడం మూడోసారి కావడం గమనార్హం. గతంలో ఓసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చినప్పటికీ అవి తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత సీఈసీని తొలగించాలని కోరుతూ ఏప్రిల్ 24న 73 మంది విపక్ష ఎంపీలు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. ప్రస్తుతం అది రాజ్యసభలో పెండింగులో ఉంది. తాజాగా ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాల అంశం తెరమీదకు రావడంతో ప్రధాన కమిషనరు తొలగింపునకు విపక్షాలు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టాయి.

# మూడో బిడ్డకు జన్మనిస్తే.. రూ.50 వేల ఎఫ్‌డీ!

మొదటిపేజీ తరువాయి

తమ సామాజిక వర్గంలో తగ్గుతున్న జనాభాను వృద్ధి చేసే ఉద్దేశంతో.. గుజరాత్‌లోని 'కచ్ కడ్వా పాటిదార్ సమాజ్' ఒక సరికొత్త పథకాన్ని ప్రకటించింది. తమ సమాజానికి చెందిన దంపతులు మూడో సంతానానికి జన్మనిస్తే.. వారికి రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బహుమతిగా ఇస్తామని వెల్లడించింది. అంతేకాకుండా, ఆ జంటను ఘనంగా సత్కరిస్తామని తెలిపింది.

దక్షిణ గుజరాత్‌లో ఈ సామాజిక వర్గానికి చెందినవారు దాదాపు 17 వేల మంది ఉన్నారు. అయితే, కొన్నేళ్లుగా వీరి జనాభా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఇటీవల నిర్వహించిన కేకేపీఎస్ దక్షిణ గుజరాత్ జోనల్ సమావేశంలో ఇదే అంశంపై చర్చ జరిగింది. యువ జంటలు ఒక బిడ్డతో సరిపెట్టుకోవడం, లేదా అసలు సంతానం వద్దనుకోవడం వంటి ధోరణులపై ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జనాభాను పెంచడంతోపాటు, పెద్ద కుటుంబాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆడపిల్ల పుట్టిన కుటుంబానికి అండగా నిలిచేందుకు, సంపాదనపరులు లేని కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

ఇదే తరహాలో సూరత్ పార్సీ పంచాయత్ కూడా జనాభా ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తోంది. మూడో బిడ్డను కనే దంపతులకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకం కింద మూడో బిడ్డకు 25 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ.5,000 చొప్పున అందిస్తున్నామని, దేశవ్యాప్తంగా ప్రస్తుతం 39 జంటలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయని పంచాయత్ అధ్యక్షుడు డా.హోమీ దూద్‌వాలా వెల్లడించారు.

# తెలంగాణలో నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలో పలుచోట్ల ఈ నెల 24, 25, 26 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ బుధవారం రాత్రికి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ ఎలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

# దానం నాగేందర్‌పై సుప్రీం తీర్పు రాజ్యాంగ విజయం:

మొదటిపేజీ తరువాయి



ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భాజపా చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టులు, క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందని విమర్శించారు. ఇకనైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉపఎన్నికకు వెళ్లాలన్నారు.

# యువత ప్రాణాలు తీస్తున్న మద్యం..

**-తాడి హిప్పర్గా గ్రామస్తుల విప్లవాత్మక నిర్ణయం**

ఈకాలం
కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం తాడి హిప్పర్గా గ్రామంలో మద్యం విక్రయాలు, విచ్చలవిడి మద్యపానానికి అడ్డుకట్ట వేసేందుకు గ్రామస్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మద్యం కారణంగా యువత భవిష్యత్తు దెబ్బతింటోందని, కుటుంబాల్లో గొడవలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ గ్రామంలో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కె. అశ్వినికి గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మద్యం మత్తులో ప్రమాదాలు.. కుటుంబాల్లో ఆందోళన గ్రామంలో మద్యం సులభంగా లభించడం వల్ల పలువురు యువకులు మద్యానికి బానిసలవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలను అతివేగంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు తీవ్రంగా గాయపడి కుటుంబాలకు భారంగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం వల్ల కుటుంబాల్లో గొడవలు పెరిగి గ్రామ ప్రశాంతతకు భంగం కలుగుతోందని తెలిపారు. విక్రయాలపై నిఘా.. పట్టుబడితే రూ. 25 వేల జరిమానా గ్రామ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మద్యం విక్రయాలపై కఠినంగా నిఘా పెట్టాలని గ్రామస్తులు నిర్ణయించారు. గ్రామంలోని కిరాణా దుకాణాల్లో మద్యం (సింధి, దారు) విక్రయించినా, ఎవరైనా మద్యం సేవించి పట్టుబడినా రూ. 25 వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందించిన వారికి రూ. 5 వేల బహుమతి అందజేస్తామని ప్రకటించారు. మహిళల నుంచి విశేష మద్దతు యువత భవిష్యత్తును కాపాడడంతో పాటు గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు గ్రామ పెద్దలు తీసుకున్న నిర్ణయానికి మహిళలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. సుమారు 45 మందికి పైగా పురుషులు, మహిళలు సంతకాలు చేసి తమ



అంగీకారాన్ని వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. మద్దతు తెలిపిన వారిలో సందీప్, కె. సురేష్, వి. గంగారామ్, టి. శంకర్, హెచ్. గణపత్, ఎస్‌కే మునీర్, బి. గంగాధర్, ఆర్. శివరామ్, బి. రామ్ మహరాజ్, కె. రాజు, ఇ. దత్తు, ఎస్‌కే గౌస్, ఎ. కమలాబాయి, బి. శాంతాబాయి, బి. నామ్‌దేవ్, ఎస్‌కే మీరా, ఎస్. బాలాజీ, ఎస్‌కే అలీ, వి. మారుతి, ఎస్‌కే ఇర్ఫాన్, ఎస్‌కే యూసుఫ్, హెచ్. హన్మంత్, ఎస్. ప్రహ్లద్, ఎస్‌కే గఫూర్, బి. రమేష్, బి. ప్రకాష్, జి. చంద్రపాల్, సి. మహాదేవ్, డి. సునీల్ తదితరులు ఉన్నారు.
7

# దేమీ కలాన్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనం..

**-ఏర్పాట్లను పరిశీలించిన డీఎల్‌పీఓ, సర్పంచ్**



ఈకాలం
కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేమీ కలాన్ గ్రామంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించే క్రమంలో గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి గ్రామంలో చేపట్టిన ఏర్పాట్లను డీఎల్‌పీఓ, గ్రామ సర్పంచ్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకున్న చర్యలను పరిశీలించి, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించేలా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.

# పక్షుల కూతలతో జాతుల గుర్తింపు

**- తాడ్వాయి జూనియర్ కళాశాల బాలికల ప్రతిభ..**

ఈకాలం
ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పరిశోధనల వైపు అడుగులు వేయాలన్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆలోచనకు తాడ్వాయి బాలికల ప్రతిభ నిదర్శనంగా నిలుస్తోంది. తాడ్వాయిలోని పీఎం శ్రీ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో కలెక్టర్ ప్రత్యేక చొరవతో 'ఎకో సెన్స్' పేరుతో ఏఐ ఆధారిత బర్డ్ సౌండ్ డిటెక్షన్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. పక్షుల కిలకిలారావాలను రికార్డు చేసి, రాస్ప్‌బెర్రీ పైతో పాటు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో పక్షి




జాతులను గుర్తించేలా ఈ వ్యవస్థను రూపొందించారు. పరిశోధన వైపు బాలికల అడుగులు తాడ్వాయి పరిసర ప్రాంతాల్లో సంచరించే పక్షుల వివరాలు, వాటి రాకపోకలు, వలస పక్షుల రాక, అరుదైన జాతుల ఉనికి వంటి అంశాలను విద్యార్థినులు ఈ సాంకేతికత ద్వారా పరిశీలిస్తున్నారు. తద్వారా వారికి శాస్త్రీయ దృక్పథంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతోంది. గ్రామీణ ప్రాంత బాలికలు సైతం ఆధునిక సాంకేతికతను వినియోగించి పరిశోధన చేసేలా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అందిస్తున్న ప్రోత్సాహం ఉపయోగపడుతోందని కళాశాల సిబ్బంది తెలిపారు. సైన్స్‌ను సమాజ శ్రేయస్సు, ప్రకృతి పరిరక్షణకు ఉపయోగించాలనే ఆలోచన విద్యార్థినుల్లో పెంపొందుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, ఎస్‌వీపీ స్రవంతి, జేవీపీ అనూషతో పాటు ఉపాధ్యాయ బృందం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# డెమీ కలాన్‌లో గణపతికి 108 రకాల నైవేద్యాలు..



ఈకాలం
కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని డెమీ కలాన్‌లో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. వివిధ రకాల పిండి వంటలు, ప్రసాదాలను ప్రత్యేకంగా తయారు చేసి స్వామివారికి మహా నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల నైవేద్యాలతో గణపతికి మహా నైవేద్యం సమర్పించడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# వరి ధాన్యం నిల్వకు ప్రైవేట్ ఫంక్షన్ హాల్ పరిశీలన..

**-అవసరమైన నిల్వ సామర్థ్యాన్ని ముందుగానే సమకూర్చుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

ఈకాలం
వరి ధాన్యం సేకరణ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని లింగంపేట మండలంలో వరి ధాన్యం తాత్కాలిక నిల్వ కేంద్రంగా వినియోగించేందుకు అందుబాటులో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఫంక్షన్ హాల్‌లోని స్థల విస్తీర్ణం, నేల పరిస్థితి, రహదారి సౌకర్యం, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉన్న అవకాశాలు, వెంటిలేషన్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం నిల్వకు ప్రాంగణం ఎంతవరకు అనుకూలంగా ఉంటుందనే విషయంపై అధికారులతో చర్చించారు. అందుబాటులో ఉన్న ప్రాంగణంలో ఎంత పరిమాణంలో ధాన్యం నిల్వ చేయవచ్చో అంచనా వేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అలాగే క్యాప్ ( కవర్ హ్యాండ్ ప్లింత్ ) పద్ధతిలో ధాన్యం నిల్వ చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని ఆదేశించారు. సాంకేతిక, మౌలిక సదుపాయాలు, నిల్వ సామర్థ్యం, రవాణా సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర సాధ్యాసాధ్యాల నివేదికను సిద్ధం చేసి తదుపరి చర్యల కోసం సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ



ప్రభాకర్, సివిల్ సప్లైస్ అధికారి వెంకటేష్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీవో, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ ఇరిగేషన్, ఏఈ ఆర్‌అండ్‌బీ, ఏఈ మిషన్ భగీరథ, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పంచాయతీ కార్యదర్శి తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తడి హిప్పర్గలో ఘనంగా 9వ జాతీయ పోషణ్ మాసం వేడుకలు..




ఈకాలం
కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం తడి హిప్పర్గ గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 9వ జాతీయ పోషణ్ మాసం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. "మన ఆరోగ్యం మన బాధ్యత" అనే నినాదంతో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8, 2026 వరకు నెల రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమంతో పాటు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది విమల, జాయిశ్రీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు సూచించారు.

# సామూహిక వందేమాతరం గేయాలాపనకు ఏర్పాట్లు..

(ఈకాలం
వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యాభారతి ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలో శుక్రవారం (సెప్టెంబర్ 25) 'నమామి భారతం' కార్యక్రమంలో భాగంగా సామూహిక వందేమాతరం గేయాలాపన నిర్వహించనున్నట్లు శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ శ్యాంసుందర్‌రావు తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్, సర్దార్ పటేల్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, శివాజీ విగ్రహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జయప్రకాష్ నారాయణ విగ్రహం (జేపీఎన్), శ్రీ సరస్వతీ శిశుమందిర్ భగత్‌సింగ్‌నగర్ తదితర 8 ప్రాంతాల్లో ఉదయం 11 గంటలకు సామూహికంగా



వందేమాతరం గేయాలాపన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతినిధులు హరిస్మరణరెడ్డి, మీరెడ్డి రాజారెడ్డి, అర్కల మల్లేష్, సామల గంగారెడ్డి, ప్రతాప్‌గౌడ్, ముప్పారపు ఆనంద్, పార్శి కృష్ణమూర్తి కోరారు.

# ఘనంగా గణేశ్ నిమజ్జన వేడుకలు

– ఆకట్టుకున్న మహిళల కోలాటం..

ఈకాలం



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజాంపేట మండల పరిధిలోని కె.వెంకటాపూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహానికి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం గణేశ్ నిమజ్జన వేడుకలను అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.నిమజ్జన వేడుకల్లో భాగంగా అంబేద్కర్ సంఘానికి చెందిన మహిళలు సంప్రదాయబద్ధంగా ఒకే రంగు చీరలు ధరించి గణనాథుడి ఎదుట కోలాటం ఆడారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు బైండ్ల నందు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి లడ్డూకు భారీ ధర..

-రూ.11,011లకు లడ్డూను దక్కించుకున్న నాగులపల్లి శ్రీరామ్

ఈకాలం



కామారెడ్డి పట్టణంలోని వడ్లగల్లిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణనాథుడి లడ్డూ వేలం పాటను ఘనంగా నిర్వహించారు. గాయత్రి ఆదర్శ సంఘం, వడ్లగల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని లడ్డూను దక్కించుకునేందుకు పోటీపడ్డారు.ఈ వేలం పాటలో నాగులపల్లి శ్రీరామ్, ప్రశాంత్, సురేష్‌లు కలిసి రూ.11,011లకు గణనాథుడి లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం సంఘం సభ్యులు, భక్తులు విజేతలను అభినందించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య వేలం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ముగిసింది.

# నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ..

ఈకాలం



మెదక్ జిల్లా పాపన్నపేట్ మండల కేంద్రం పాపన్నపేటలో నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు, బాటసారులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే మించిన దైవకార్యం లేదని, 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పండుగలు, ఉత్సవాల సమయంలోనే కాకుండా భవిష్యత్తులోనూ మరిన్ని సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.అన్నప్రసాద వితరణకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంఘం సభ్యులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నిర్వహించిన నవయువ సేవా సంఘం యువకులను స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, విక్రమ్ రాజు, సురేందర్ సింగ్, కృష్ణ, రాజ్ కుమార్, శ్రీనివాస్, రాజేష్, శివశంకర్, పృథ్వీరాజ్‌తో పాటు యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# డప్పుల దరువులు.. సంప్రదాయ నృత్యాలతో గణేష్ నిమజ్జన శోభాయాత్ర..

-డీజేలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో వేడుకలు.. పోలీసుల బందోబస్తుపై ప్రజల హర్షం

-డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా

-కాలినడకన నిమజ్జన రూట్‌ను పర్యవేక్షించిన ఎస్పీ

ఈకాలం



కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర గురువారం భక్తిశ్రద్ధలు, డప్పుల దరువులు, డోలు బ్యాండ్లు, సంప్రదాయ నృత్యాల నడుమ అంగరంగ వైభవంగా కొనసాగింది. గణనాథుడి శోభాయాత్రను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది.నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ స్వయంగా పర్యవేక్షించారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా భద్రతా ఏర్పాట్లను నిరంతరం పరిశీలించడంతో పాటు, కాలినడకన నిమజ్జన రూట్‌లో పర్యటించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులను కలిసి శోభాయాత్ర సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతోంది. నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పోలీసులకు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ తెలిపారు. అందరి సమన్వయంతోనే నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.డీజేలు లేకపోవడంపై ప్రజల హర్షం నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు తరలివచ్చిన ప్రజలు డీజే శబ్దాలు లేకుండా సంప్రదాయ పద్ధతిలో శోభాయాత్ర కొనసాగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డీజే సౌండ్ లేకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా వేడుకలను వీక్షించే అవకాశం కలిగిందని పలువురు తెలిపారు. ప్రజల భద్రత, ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు తీసుకున్న చర్యలపై అభినందనలు వ్యక్తం చేశారు. నిమజ్జన శోభాయాత్రను తిలకించే ప్రజలు రోడ్లపై గుమిగూడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోలీసుల సూచనలకు సహకరించాలని కోరారు. భక్తి, సంప్రదాయం, ఆనందోత్సాహాల మధ్య గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే. నర్సింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ ఎన్. మధుసూదన్, ఇతర డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాన్సువాడలో జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణ..

-సెప్టెంబర్ 29, 30 తేదీల్లో నిర్వహణ

ఈకాలం



కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఎస్.ఆర్.ఎన్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 29, 30 తేదీల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు.

శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, చర్చించనున్న అంశాలు, జర్నలిస్టులకు అందించనున్న శిక్షణ వివరాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, చైర్మన్ ఓవస్టీ రహ్మాన్, మేనేజర్ శైలేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, అవసరాలను కూడా మీడియా అకాడమీ కార్యదర్శి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.రెండు రోజుల శిక్షణలో సమాచార హక్కు చట్టం, వార్తల్లో తప్పొప్పుల పరిశీలన, నేర వార్తల కవరేజ్, వార్తా కథనాల రూపకల్పన, వార్తా సేకరణ, వార్తల ప్రాధాన్యత నిర్ణయం, వాస్తవ నిర్ధారణ, మీడియా చట్టాలు–నైతిక నియమాలు, జర్నలిజంలో పాటించాల్సిన వృత్తిపరమైన ప్రమాణాలు తదితర అంశాలపై నిపుణులు శిక్షణ అందించనున్నారు.జర్నలిజం రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వెంకటేశ్వరరావు తెలిపారు. శిక్షణ ద్వారా పొందే జ్ఞానం జర్నలిస్టులకు రోజువారీ వృత్తి విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను ఆహ్వానించగా, హాజరై జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడేందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు.

# దోమకొండ ఎక్సైజ్ సీఐగా సర్వేశ్వర్ రావు..

- కరాటేలో 6వ డాన్ బ్లాక్ బెల్ట్.. యువతకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ

ఈకాలం



కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐగా సర్వేశ్వర్ రావు బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 3న బదిలీపై దోమకొండకు వచ్చిన ఆయనకు పోలీసు, ఎక్సైజ్ శాఖల్లో 17 ఏళ్లకు పైగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది.సర్వేశ్వర్ రావు ఎం.కామ్, బీఈడీ విద్యార్హతలు పూర్తి చేశారు. 2009 బ్యాచ్‌లో ఎస్సైగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన 2014 వరకు ఎస్సైగా విధులు నిర్వర్తించారు. అనంతరం 2014 నుంచి 2024 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా పనిచేశారు. 2024 నుంచి 2026 ఫిబ్రవరి వరకు జగిత్యాల జిల్లాలో ఎస్‌హెచ్ఓగా సేవలందించారు.యువతకు ఉచిత శిక్షణ విధి నిర్వహణతో పాటు యువతకు ఉపయోగపడే కార్యక్రమాలపై కూడా సర్వేశ్వర్ రావు ఆసక్తి చూపుతున్నారు. తన స్నేహితులు, సహచర అధికారులు, వారి పిల్లలకు పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు ఫిజికల్ ట్రైనర్‌గా శిక్షణ ఇచ్చిన అనుభవం ఉందని తెలిపారు. యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.కరాటేలో 6వ డాన్ సర్వేశ్వర్ రావుకు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక ఆసక్తి ఉంది. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన ఆయన 6వ డాన్ స్థాయి అర్హతను పొందారు. యువతలో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలిపారు.అక్రమ మద్యం నియంత్రణపై ప్రత్యేక దృష్టి దోమకొండ మండల పరిధిలో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామని సీఐ సర్వేశ్వర్ రావు తెలిపారు. అక్రమ మద్యం, గుడుంబా తయారీ, విక్రయాలు తదితర కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

# భారీ ధర పలికిన గణనాథుడి లడ్డూ..

-రూ.24,011లకు లడ్డూను కైవసం చేసుకున్న ప్రశాంత్, వైష్ణవి, రివ పటేల్

ఈకాలం

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బిచ్కుంద పట్టణంలోని వడ్లగల్లిలో గణనాథుడి లడ్డూ వేలం పాటను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువ భారత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వేలం పాటలో ప్రశాంత్, వైష్ణవి, రివ పటేల్ రూ.24,011లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం మండలి సభ్యులు, భక్తులు విజేతలను అభినందించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య వేలం కార్యక్రమం ఘనంగా ముగిసింది.



# గణేష్ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**– జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..**

ఈకాలం

గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ చెరువులో జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. టేక్రియాల్ చెరువులో సుమారు 700కు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని



సూచించారు. చెరువు వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, అనుమతి లేని వ్యక్తులు నీటిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనం కోసం పెద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వాటర్‌ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేసి, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, అగ్నిమాపక శాఖల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ వైర్లు విగ్రహాలకు తగలకుండా తగిన ఎత్తులో ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అధిక సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే నేపథ్యంలో చెరువు వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహాలు వరుస క్రమంలో నిమజ్జనం అయ్యేలా తహసీల్దార్, పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులు, ప్రజలు నిమజ్జన కార్యక్రమంలో జాగ్రత్తలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు.

# హార్వెస్టింగ్ పాండ్‌ను పరిశీలించిన కలెక్టర్..

ఈకాలం



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మీశన్‌పల్లి గ్రామంలో నిర్మించిన హార్వెస్టింగ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. పాండ్ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వినియోగం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాండ్ వద్ద ఉపాధి హామీ కూలీలకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేలా హార్వెస్టింగ్ పాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న నీటి సంరక్షణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రోడ్డ ప్రభాకర్, డీఆర్‌డీఓ దామోదర్, ఎంపీడీవో తహీరా బేగమ్, తహసీల్దార్ ప్రేమ్, మండల స్పెషల్ ఆఫీసర్ నరసయ్య, సర్పంచ్, ఉప సర్పంచ్, ఏపీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

# కనీస వేతనాల జీవో 6 అమలకై ఉద్యమించండి...

**– టి యు సి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి రామయ్య పిలుపు**

ఈకాలం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 6 స్రశీ వెంటనే అన్ని రంగాల కార్మికులకు వర్తింపచేయాలని టి యు సి ఐ ఆధ్వర్యంలో (గురువారం) బైపాస్ రోడ్ లో కరపత్రాన్ని విడుదల చేశారు, ఈ సందర్భంగా జి రామయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026 జూన్ ఒకటో తారీకు నుంచి అమలు చేయాలని విడుదల చేసి కోటి మంది పైగా కార్మికులకు లబ్ధి పొందుతున్నారని ప్రకటించడం, ఈ ప్రకటనలు కాగితాలకే పరిమితమైన అని వారు ఆరోపించారు, ఆనాటి కెసిఆర్ నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పారిశ్రామికవేతలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు తప్ప సంపదకి సృష్టికర్తలైన కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు జీవోలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వారు విమర్శించారు, రాష్ట్ర ప్రభుత్వం 6 జీవో అమలు చేయాలని ఈనెల 25 నుంచి 30 వరకు అన్ని రంగాల కార్మికుల వద్ద ఆందోళనలో నిర్వహించాలని ప్రదర్శనలు జరపాలని టి యు సి ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ ఆందోళనలో అన్ని రంగాల కార్మికుల భాగస్వాములు కావాలని వారు కోరారు, కనీస వేతనాల జీవోలో జోన్స్ గా విభజించటం గత జీవోలలో అన్నిటిని జోన్స్ లేవు కానీ నేటి జీవోలలో జోన్స్ గా నిర్ధారించడం సరి అయింది కాదని దీనివలన కార్మికులు తీవ్ర నష్టం జరుగుతుందని వారన్నారు, కార్మిక వర్గం అప్పు చేసి పప్పుకూడు తినవలసిన స్థితికి ఈ ఈ జీవోల వల్ల వచ్చిందని, ముఖ్యంగా పట్టణ కార్మికుడికైనా గ్రామీణ, మున్సిపాలిటీ, కార్మికుల కైనా సరుకుల ధరలు ఒకే రకంగా ఉంటాయని వారు అన్నారు, కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారంఅన్ని రంగాల కార్మికులకు




ఎటువంటి మినహాయింపు లేకుండా అమలు చేసి కార్మికులను కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా జరిగే దశల వారి ఆందోళనలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జీవో అమలు కోసం ప్రభుత్వంపైఒత్తిడి చేయాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో లిటి యు సి ఐ నగర కార్యదర్శి కే శ్రీనివాస్ నగర్ నాయకులు సైదులు, ప్రభాకర్, రవీందర్, రవి, చందు, తదితరులు పాల్గొన్నారు

# రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఎన్నికలకు 31 నామినేషన్లు..

ఈకాలం



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించారు. మొత్తం 15 మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవులకు 31 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి పి. రామమోహన్ వెల్లడించారు.

# గోండి భాషపరిరక్షణకు వర్క్‌షాప్‌గోండి భాషకు 8వ షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించాలి

**– భాషా సంస్కృతి పరిరక్షణకు అందరూ కృషి చేయాలి**

ఈకాలం

అక్టోబర్ 2 నుంచి భద్రాచలంలో గోండి భాష వర్క్‌షాప్ భావితరాలకు గోండి భాషను అందించడమే లక్ష్యం..: ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు వి.సి. దొర, కోశాధికారి సోలం రామారావు అన్నారు. గోండి భాషను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు భద్రాచలంలోని గిరిజన భవన్‌లో గోండి భాష వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు



తెలిపారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ 3898/90, గోటుల్ గోండ్వానా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో గోండి భాష పరిరక్షణ, అభివృద్ధి, భావితరాలకు భాషను అందించే అంశాలపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గోండి భాషకు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో అధికారిక గుర్తింపు కల్పించి చేర్చాలనే డిమాండ్‌తో భాషా పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గోండి భాషపై ఆసక్తి ఉన్న ఆదివాసీ యువత, విద్యార్థులు, భాషాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ డాక్టర్ చందా లింగయ్య దొరను నిర్వాహకులు సాధారణంగా ఆహ్వానించారు. ఆదివాసీ భాష, సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు....

# నేడే ఎన్‌ఎస్‌ఎస్ డే.. సమాజ సేవలో యువత కీలక పాత్ర..



ఈకాలం

'నాకోసం కాదు.. నీ కోసం' అనే గంభీరమైన ధ్యేయవాక్యంతో పనిచేస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) యువతలో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తోందని లెక్చరర్ ఉమాశేషారావు వైద్య అన్నారు. సెప్టెంబర్ 24న జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1969 సెప్టెంబర్ 24న ప్రారంభమైన ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులు గ్రామీణ సమస్యలను తెలుసుకోవడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, అక్షరాస్యత కార్యక్రమాలు, ప్లాస్టిక్ నివారణ, ఉచిత వైద్య శిబిరాలు తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవడం ద్వారా బాధ్యతాయుతమైన, ఉత్తమ పౌరులుగా ఎదగవచ్చని ఉమాశేషారావు వైద్య అన్నారు.

# నార్లాపూర్‌లో ఘనంగా పోషణ మాసం

**పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం..**

ఈకాలం



మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు వివిధ రకాల పోషక విలువలతో కూడిన వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు తదితర పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, వార్డు సభ్యులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149